డీజీపీని కలిసిన చెన్నయ్య

రాష్ట్ర డీజీపీ జితేందర్‌ను తెలంగాణ స్కూల్ స్పోర్ట్స్ కరాటే అసోసియేషన్ అధ్యక్షుడు, మాస్టర్ చెన్నయ్య శనివారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా పుష్పగుచ్ఛాన్ని అందించి శుభాకాంక్షలు తెలిపారు. డీజీపీగా జితేందర్ బాధ్యతలు చేపట్టడం సంతోషంగా ఉందన్నారు. –షాద్‌నగర్‌టౌన్, జూలై 20

నకిలీ నోట్ల ముఠా గుట్టురట్టు

మీడియాకు వివరాలు వెల్లడిస్తున్న వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

- రూ.7.95 ఫేక్ కరెన్సీ స్వాధీనం
- నలుగురి అరెస్టు, రిమాండ్‌కు తరలింపు
- వివరాలు వెల్లడించిన వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి

ధారూరు/యాలాల, జూలై 20 : నకిలీ నోట్ల ముఠా గుట్టును పోలీసులు రట్టు చేశారు. రూ.7.95 లక్షల విలువ గల ఫేక్ కరెన్సీని స్వాధీనం చేసుకుని నలుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నట్లు వికారాబాద్ ఎస్పీ నారాయణరెడ్డి తెలిపారు. శనివారం ఆయన వికారాబాద్ ఎస్పీ కార్యాలయంలో నిర్వహించిన విలేకరుల సమావేశంలో వివరాలు వెల్లడించారు. తాండూరు సెగ్మెంట్ బషీరాబాద్ మండలంలోని ఇందర్‌చెడ్ గ్రామానికి చెందిన చంద్రప్ప అలియాస్ చంద్రయ్య బండల వ్యాపారం చేస్తూ తాండూరు పట్టణంలోని అయ్యప్పనగర్‌లో జీవిస్తున్నాడు. కాగా శుక్రవారం తాండూరు రైల్వేస్టేషన్‌లో అనుమానాస్పదంగా తిరుగుతున్న చంద్రయ్యను పోలీసులు పట్టుకున్నారు. అతడిని తనిఖీ చేయగా రూ 45 వేలు నకిలీ కరెన్సీ ఉన్నది. అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా.. తనతోపాటు ఏపీలోని విజయనగరం జిల్లా సుంకరిపేటకు చెందిన బ్యాంక్ ఆఫ్ బరోడాలో బ్యాంకు నిధులను దుర్వినియోగం చేసిన కేసులో సంగారెడ్డి జిల్లా జహీరాబాద్ పీఎస్‌లో జైలుశిక్ష అనుభవించిన మాజీ మేనేజర్ ఇచ్చాపురం జగదీశ్, నకిలీ నోట్ల చెలామణి తోపాటు గంజాయి అక్రమ రవాణా కేసుల్లో సంగారెడ్డి జైల్లో శిక్ష అనుభవించిన కోనసీమ జిల్లా రామచంద్రాపురం మండలంలోని నరసరావుపేటకు చెందిన బడుగంటి వీర వెంకటరమణ అలియాస్ వెంకీ, తూర్పుగోదావరి జిల్లా కిర్లంపూడి మండలానికి చెందిన ప్రగల్లపాటి శివకుమార్.. నలుగురం కలిసి ఓ ముఠాగా ఏర్పడి నకిలీ నోట్లను ముద్రించి చెలామణి చేస్తున్నట్లు ఒప్పుకున్నాడు. వాటిని మేడ్చల్ జిల్లా దుండిగల్ పీఎస్ పరిధిలోని ఎస్ఆర్ఎస్ వృషబాద్రి అపార్ట్‌మెంట్‌లో కంప్యూటర్ మానిటర్, సీపీ యూ, కలర్ ప్రింటర్ తదితర వస్తువులతో నకిలీ నోట్లను ముద్రిస్తున్నట్లు చెప్పాడు.

దీంతో చంద్రయ్యతో కలిసి అపార్ట్‌మెంట్‌కు వెళ్లిన పోలీసులు ముఠాలోకి మిగిలిన ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ. 7.50 లక్షల నకిలీ కరెన్సీతోపాటు కంప్యూటర్, ఇతర సామగ్రి, ఐదుసెల్ ఫోన్‌లను స్వాధీనం చేసుకు న్నట్లు వివరించారు. నకిలీ నోట్ల చెలామణి గుట్టురట్టు చేయడంలో కీలకంగా వ్యవహరించిన తాండూరు డీఎస్పీ బాలకృష్ణారెడ్డి, తాండూ రు పట్టణ సీఐ సంతోష్ కుమార్, ఎస్ఐ రాములు, హెడ్ కానిస్టేబుళ్లు అంజద్, శివకుమార్, సాయప్ప, షబిల్, ప్రభులింగంలను ఎస్పీ అభినందించి రివార్డులు అందజేశారు.

కలెక్టరేట్‌లో ప్రజాపాలన సేవా కేంద్రం ఏర్పాటు

వికారాబాద్ కలెక్టర్ ప్రతీక్‌జైన్

వికారాబాద్, జూలై 20 : కలెక్టరేట్‌లో ప్రజల సౌకర్యార్థం ప్రజాపాలన సేవా కేంద్రాన్ని ఏర్పాటు చేసినట్లు కలెక్టర్ ప్రతీక్‌జైన్ శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు ఇప్పటికే మున్సిపల్ పట్టణాలు, మండల కేంద్రాల్లోని ఎంపీడీవో కార్యాలయాల్లో ఈ కేంద్రాలు అందుబాటులో ఉన్నాయన్నారు. వివిధ పనుల నిమిత్తం, సమస్యలు విన్నవిస్తూ అర్జీలు సమర్పించేందుకు కలెక్టరేట్‌కు వచ్చే వారికి ప్రజాపాలన సేవా కేంద్రం అందుబాటులో ఉండాలని భావించి ఏర్పాటు చేశామన్నారు. వంట గ్యాస్ సిలిండర్ రాయితీ, 200 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్తు తదితర పథకాలను అర్హులైన ప్రతి కుటుంబానికీ అందించే దిశగా చర్యలు తీసుకుంటున్నామన్నారు. పలు కారణాల వల్ల ఉచిత విద్యుత్తు, సబ్సిడీ గ్యాస్ సిలిండర్ పొందలేకపోతున్న అర్హులైన దరఖాస్తుదారులు ప్రజాపాలన సేవా కేంద్రాల్లో సరిచేయించుకోవాలన్నారు. కలెక్టరేట్‌లోని సేవా కేంద్రం ఉదయం 10.30 నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు అన్ని పనిదినాల్లో అందుబాటులో ఉంటుందని తెలిపారు. డేటా సవరణ కోసం వచ్చే దరఖాస్తుదారులు తమ వెంట రేషన్, ఆధార్ కార్డులు, విద్యుత్తు సర్వీస్ కనెక్షన్‌నంబర్, గ్యాస్ కనెక్షన్ నంబర్, ఎల్‌పీజీ కస్టమర్ ఐడీ, మొబైల్ నంబర్ తీసుకురావాలని పేర్కొన్నారు.

రైస్‌మిల్లును తనిఖీ చేస్తున్న వికారాబాద్ అదనపు కలెక్టర్ లింగ్యానాయక్

సీఎంఆర్‌ను వేగవంతం చేయాలి

- వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్
- పరిగిలోని రెండు రైస్‌మిల్లుల ఆకస్మిక తనిఖీ

పరిగి, జూలై 20 : సీఎంఆర్‌ను వేగవంతం చేయాలని వికారాబాద్ జిల్లా అదనపు కలెక్టర్ లింగ్యానాయక్ పేర్కొన్నారు. శనివారం ఆయన పరిగిలోని వెంకటసాయి, శివశక్తి రైస్‌మిల్లులను ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ రైస్‌మిల్లర్లు తమకు ఇచ్చిన లక్ష్యాలకు అనుగుణంగా సీఎంఆర్ వేగవంతం చేయాలన్నారు. ఎఫ్‌సీఐకి ఇచ్చిన గడువు లోపు సీఎంఆర్‌ను అందించాలన్నారు. అనంతరం ఆయన తహసీల్దార్ కార్యాలయంలో ధరణిలో చేపడుతున్న పనులపై రెవెన్యూ అధికారులతో సమీక్ష నిర్వహించారు. భూముల విస్తీర్ణంలో ఏవైనా తప్పులు దొర్లితే రైతుల ద్వారా తీసుకున్న దరఖాస్తులను పరిశీలించి సరి చేయాలన్నారు. కార్యక్రమంలో తహసీల్దార్ ఆనంద్ రావు, పౌర సరఫరాల డిప్యూటీ తహసీల్దార్ సుగుణ తదితరులు పాల్గొన్నారు.

దుద్యాలలో కూలిన ఇల్లు

శుక్రవారం రాత్రి నుంచి కురుస్తున్న వాన

బొంరాస్‌పేట, జూలై 20 : రెండు రోజులుగా కురుస్తున్న ఎడతెరిపి లేని వానకు శుక్రవారం రాత్రి దుద్యాల మండల కేంద్రంలోని ఆకారం రమేశ్ ఇంటి పై కప్పు కూలింది. ముసురు వర్షానికి ఇంటి గోడల్లోకి వర్షపు నీరు చేరడంతో మట్టి గోడలు తడిసి వంటగది పైకప్పు కూలిపోయింది. కుటుంబ సభ్యులు రాత్రి వేరే ఇంట్లో పడుకోవడంతో ఎలాంటి ప్రాణనష్టం జరుగలేదు. అదేవిధంగా బొంరాస్‌పేట, దుద్యాల మండలాల్లో రెండు రోజులుగా వర్షం కురుస్తున్నది. ముసురు వానకు గ్రామాల్లో అం తర్గత దారులు అధ్వానంగా మారి ప్రజలు, వాహనచోదకులు ఇబ్బందిపడుతున్నారు. శనివారం మండలంలో 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది. ఈ వాన పంటలకు ఎంతో మేలు చేస్తుందని అన్నదాతలు పేర్కొంటున్నారు.

సమావేశంలో మాట్లాడుతున్న డీఈవో రేణుకాదేవి

వందశాతం ఉత్తీర్ణత సాధించాలి

వికారాబాద్ డీఈవో రేణుకాదేవి

బంట్వారం(కోట్‌పల్లి), జూలై 20 : రానున్న పదోతరగతి పరీక్షల్లో వందశాతం ఉత్తీర్ణత సాధించాలని వికారాబాద్ డీఈవో రేణుకాదేవి టీచర్లకు సూచించారు. శనివారం ఆమె మండల కేంద్రంలోని జడ్పీహెచ్ఎస్‌లో నిర్వహించిన పేరెంట్స్ కమిటీ మీటింగ్‌కు ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడుతూ.. ప్రతి విద్యార్థిపై ప్రత్యేక శ్రద్ధ చూపాలని.. ఉపాధ్యాయులు అర్థమయ్యేలా బోధించాలన్నారు. గతేడాదిలాగా ఫలితాలుంటే చర్యలు తప్పవని హెచ్చరించారు. అనంతరం విద్యార్థుల తల్లిదండ్రులతో మాట్లాడుతూ.. తమ పిల్లలను ప్రభుత్వ బడులకు పంపించాలని.. మధ్యాహ్న భోజనం, రెండు జతల దుస్తులు, పుస్తకాలు, నోట్‌పుస్తకాలను ప్రభుత్వం ఉచితంగా పంపిణీ చేస్తున్నదన్నారు. ఈ సందర్భంగా ఆమె పాఠశాలలో జరుగుతున్న మరమ్మతు పనులు, కిచన్ గార్డెన్‌ను సందర్శించారు. కార్యక్రమంలో ఎంఈవో చంద్రప్ప, ఎస్ఎంసీ చైర్మన్ శాంతమ్మ, ఇతర సభ్యులు ఉమాదేవి, ఉపాధ్యాయులు బుచ్చిరెడ్డి, రాంరెడ్డి, మోహన్, వెంకటనర్సింహారెడ్డి, తిరుమలయ్య, మల్లేశం, లక్ష్మణ్, యాస్మిన్‌బేగం తదితరులు పాల్గొన్నారు.

కల్తీ డిజీల్ తయారు..

మూడు ట్యాంకర్ల సీజ్

నందిగామ, జూలై 20 : కల్తీ డీజిల్‌ను తరలిస్తున్న మూడు ట్యాంకర్లను విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు పట్టుకుని సీజ్ చేశారు. ఈ ఘటన శుక్రవారం రాత్రి మండల కేంద్రంలో జరిగింది. పోలీసులు తెలిపిన ప్రకారం.. నందిగామ బైపాస్ రోడ్డు సమీపంలోని ఓ గోదాంలో క్రూడ్ ఆయిల్‌ను తీసుకొచ్చి కొన్ని రసాయనాలతో కల్తీ డీజిల్ తయారు చేస్తున్నారన్న విశ్వసనీయ సమాచారం మేరకు శుక్రవారం రాత్రి విజిలెన్స్, సివిల్ సప్లయ్ అధికారులు ఆకస్మిక దాడులు చేశారు. 12వేల లీటర్ల సామర్థ్యం కలిగిన మూడు డీజిల్ ట్యాంకర్లను సీజ్ చేశారు. ట్యాంకర్లలోని డీజిల్ నమూనాలను సేకరించి ల్యాబ్‌కు పంపిస్తామన్నారు. తనిఖీల్లో టాస్క్‌ఫోర్స్ ఎస్సీ శశిధర్‌రాజు, డీఎస్‌వో రాథోడ్, డీటీలు రవీందర్‌నాయక్, రఘునందన్ ఉన్నారు. ఎన్‌ఫోర్స్‌మెంట్ డీటీ వెంకట్‌ప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమో దు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు నందిగామ సీఐ ప్రసాద్ తెలిపారు.

ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులు ఇవ్వాలి..

ప్రభుత్వం వెంటనే ఈహెచ్ఎస్ హెల్త్ కార్డులను టీచర్లకు అందించాలని పీఆర్‌టీయూ టీఎస్ జిల్లా అధ్యక్షుడు కన్నయ్యగారి గోవర్ధన్ డిమాండ్ చేశారు. జిల్లాలో సభ్యత్వ నమోదు కార్యక్రమంలో భాగంగా ఆమనగల్లు మండల కేంద్రంలోని జడ్పీ బాలికల ఉన్నత పాఠశాల, జడ్పీ బాలుర ఉన్నత పాఠశాల, జిల్లా పరిషత్ (బస్టాండ్) ఉన్నత పాఠశాలలో పీఆర్‌టీయూ టీఎస్ సభ్యత్వ నమోదు కార్యక్రమం చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడు తూ..ప్రభుత్వం వెంటనే ప్రమోషన్లలో మిగిలిపోయిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని, జీవో 11, 12లను సవరించి బీఈడీ అర్హత కలిగిన టీచర్లకు పీఎస్‌హెచ్ ఎంలుగా ఉద్యోగోన్నతి కల్పించాలని, పెండింగ్ డీఏలను విడుదల చేయాలన్నారు. కార్యక్రమంలో రాష్ట్ర అసోసియేట్ అధ్యక్షుడు ప్రధానోపాధ్యాయులు పాండు, మండల శాఖ అధ్యక్షుడు సుదర్శన్, ప్రధాన కార్యదర్శి చంద్రం, రాష్ట్ర బాధ్యులు చెన్నకేశవరెడ్డి, జంగయ్య పాల్గొన్నారు. –ఆమనగల్లు, జూలై 20

మీరాలంపై కేబుల్ బ్రిడ్జికి అధ్యయనం

- ట్రాన్సాక్షన్ అడ్వైజరీ, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ కన్సల్టెంట్లతో పరిశీలన
- నోటిఫికేషన్ జారీ చేసిన హెచ్ఎండీఏ

సిటీబ్యూరో, జూలై 20(నమస్తే తెలంగాణ): మీరాలం ట్యాంక్ కేబుల్ బ్రిడ్జి నిర్మాణానికి హెచ్ఎండీఏ సన్నాహాలు చేస్తున్నది. మీరాలం చెరువును పర్యాటక ప్రాంతంగా, బెంగళూరు హైవేకు రవాణా సదుపాయాలతో ఆధునీకరించాలని కేసీఆర్ ప్రభుత్వం నిర్ణయం తీసుకున్నది. ఈ క్రమంలో మీరాలం బ్యూటిఫికేషన్ అప్పట్లోనూ కార్యాచరణ రూపొందించగా, తాజాగా చెరువు అభివృద్ధికి చేపట్టాల్సిన నమూనాలను తీర్చిదిద్దేందుకు కన్సల్టెన్సీని ఏర్పాటు చేసుకున్నది. దీంతోపాటు ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ తయారు చేసి, పబ్లిక్ – ప్రైవేట్ ప్రాజెక్టుగా తీర్చిదిద్దేందుకు అవసరమైన సమగ్రమైన విధి విధానాలను రూపొందించాల్సి ఉంటుంది. అదే విధంగా ప్రాజెక్టు నిర్మాణానికి అవసరమైన ఖర్చు, ట్రాఫిక్ రద్దీ వంటి అంశాలను పరిగణనలోకి తీసుకుని డీపీఆర్ సిద్ధం చేయాల్సి ఉంటుంది. అదేవిధంగా నిర్మాణ సాధ్యసాధ్యాలు, వ్యయ, ఆదాయ వనరులపై అంచనా వేయాల్సి ఉంటుంది. ప్రాజెక్టు నిర్మాణానికి కావాల్సిన నిధులు, విశ్లేషణతోపాటు హెచ్ఎండీఏపై ఆర్థిక ప్రభావాన్ని తయారు చేయాల్సి ఉంటుంది. దీంతో పాటు టోల్ కలెక్షన్, డిజిటల్ ప్రకటనలు, ప్రాజెక్టు విలువ, రెవెన్యూ మార్గాలపై ప్రత్యేకంగా సూచించాల్సి టుంది. పర్యాటక ప్రాంతం గా తీర్చిదిద్దడంతో పాటు, ఆదాయం పెరిగేందుకు ఉం డే అవకాశాలను కూడా విశ్లేషించి, హెచ్ఎండీఏకు సరిపోయే విధానాలను సంబంధిత కన్సల్టెన్సీలు సూచించా ల్సి ఉంటుంది. సమీపంలో ఉండే జూ పార్క్‌ను అనుసంధానం చేస్తూ ప్రాజెక్టు డిజైన్లు రూపొందించేందుకు కన్సల్టెన్సీలు పనిచేస్తాయని హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి.

ఆరు లేన్ల రోడ్ల నిర్మాణం..

బెంగళూరు హైవే మార్గాన్ని మరింత విస్తరించేలా ఆరులేన్ల ఎలివేటెడ్ కారిడార్ నిర్మాణానికి హెచ్ఎండీఏ ప్రణాళికలు రూపొందించింది. బెంగళూరు హైవే నుంచి చింతల్‌మెంట్ మీదుగా అత్తాపూర్ వరకు 2.65 కిలోమీటర్ల దూరంలో ఈ ప్రాజెక్టును నిర్మించనున్నది. దీంతో ట్రాఫిక్ రద్దీ, రవాణా దూ రం తగ్గిపోవడం, మీరాలం చెరువును చూసేందుకు వీలుగా ప్రాజెక్టును డిజైన్ చేశారు. దీనిపై వ్యూడెక్, స్కై వాక్‌తో పాటు నెహ్రూ జువాలజికల్ పార్క్‌ను చేరుకునేలా డిజైన్ చేశారు. ప్రభుత్వ ఆదేశాలతో హెచ్ఎండీఏ మీరాలం అభివృద్ధి పనులకు ట్రాన్సాక్షనల్ అడ్వైజరీ, ఏరియా డెవలప్‌మెంట్ ప్లాన్ వ్యవహారాలను పర్యవేక్షించేందుకే ఈ కన్సల్టెన్సీలను నియమించనున్నట్లుగా హెచ్ఎండీఏ వర్గాలు పేర్కొన్నాయి. కాగా, మీరాలం ట్యాంకు ఆధునీకరణలో భాగంగా సైకిల్ ట్రాక్, పెడస్ట్రీయన్ ట్రాక్ కూడా అందుబాటులోకి రానుంది. దీంతో మీరాలం వెంబడి పర్యాటక రంగానికి మరింత అవకాశం ఏర్పడుతుందని జూ పార్క్ సందర్శనకు వచ్చేవారికి అనువుగా ప్రాజెక్టు ఉండాలని ప్రణాళికలను గతంలోనే అధికారులు సిద్ధం చేశారు.

నిరంతరం.. అప్రమత్తం

వర్షాల నేపథ్యంలో ఇబ్బందులు రాకుండా చర్యలు

బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సాగర్‌లోకి 1517 క్యూసెక్కుల వరద నీరు విడుదల

క్షేత్రస్థాయిలో పర్యటిస్తున్న బల్దియా కమిషనర్ ఆమ్రపాలి

సిటీబ్యూరో, జూలై 20 (నమస్తే తెలంగాణ) : వాతావరణ శాఖ హెచ్చరికల నేపథ్యంలో గ్రేటర్‌లో కురుస్తున్న వర్షాలకు జీహెచ్ఎంసీ అధికారులు క్షేత్రస్థాయిలో అప్రమత్తమైనట్లు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి తెలిపారు. శుక్రవారం రాత్రి, శనివారం రోజంతా ఎడతెరిపి లేకుండా కురుస్తున్న ముసురుతో ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు, స్టాటిక్ బృందాలు రంగంలోకి దిగి... నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు తొలగిస్తున్నట్లు పేర్కొన్నారు. ట్రాఫిక్ ఇబ్బందులు ఏర్పడకుండా ఆయా విభాగాల అధికారులు పూర్తి సమన్వయంతో పనిచేస్తున్నట్లు చెప్పారు. వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీరును తొలగించేందుకు 238 స్టాటిక్, 154 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు పనిచేస్తున్నాయని, ఈ బృందాలకు తోడుగా హైడ్రా ద్వారా 30 సీఆర్ఎంపీ, 29 మాన్‌సూన్ ఎమర్జెన్సీ బృందాలు నిరంతరం క్షేత్ర పరిధిలో బాధ్యతాయుతంగా వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద నిలిచిన నీటిని ఎప్పటికప్పుడు క్లియర్ చేస్తున్నట్లు తెలిపారు.

రూ. 78 కోట్లు.. 107 జంక్షన్లు

ప్రమాదాల నివారణకు గ్రేటర్‌లో కూడళ్ల అభివృద్ధి పనులు చేపట్టినట్లు బల్దియా కమిషనర్ ఆమ్రపాలి శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. కూడళ్ల సుందరీకరణ, వాహనాలను క్రమబద్ధీకరించడం, పాదచారులకు ప్రమాదాలు జరగకుండా నిరోధించేందుకు రూ.78 కోట్ల అంచనా వ్యయంతో 107 జంక్షన్ల అభివృద్ధికి చర్యలు చేపట్టినట్లు తెలిపారు. ఇప్పటివరకు 31 కూడళ్లు పూర్తవ్వగా, 13 వివిధ అభివృద్ధి దశలో ఉన్నాయన్నారు. 17 జంక్షన్ల పనులకు పరిపాలన అనుమతులు మంజూరు కావాల్సి ఉన్నదన్నారు. 16 జంక్షన్లలో పనులు మొదలు చేయాల్సి ఉందన్నారు. ఎనిమిది చోట్ల పనులు టెండర్ దశలో ఉన్నాయని, మరో 8 చోట్ల భూసేకరణ చేయాల్సి ఉన్నదని, 14 జంక్షన్లు ఫిసిబులిటీలో లేవని కమిషనర్ పేర్కొన్నారు. సర్కిళ్ల వారీగా ప్రాధాన్యత గల జంక్షన్లను గుర్తించి అభివృద్ధి చేస్తామన్నారు.

సాగర్ పరిసర ప్రాంతాలు అప్రమత్తం

హుస్సేన్‌సాగర్ నీటి నిల్వల విషయంలో ఎలాంటి ఆందోళన చెందవద్దని, పరిస్థితి పూర్తి అదుపులో ఉన్నదని బల్దియా అధికారులు స్పష్టం చేశారు. గడిచిన రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో హుస్సేన్‌సాగర్‌లోకి వరద నీరు భారీగా వచ్చి చేరుతున్నదని, పూర్తి స్థాయి నీటి మట్టం(ఫుల్ ట్యాంక్ లెవల్) 513.41 మీటర్లు కాగా ప్రస్తుతం 513.30 మీటర్ల మేర నీరు వచ్చి చేరిందన్నారు. గరిష్ఠంగా 514.75 మీటర్ల వరకు నీటిని నిల్వ చేసుకునే అవకాశం ఉన్నదని వివరించారు. ఎగువ ప్రాంతాల నుంచి సాగర్‌లోకి 1517 క్యూసెక్కుల వరద నీరు వచ్చి చేరుతుండగా, దిగువ మూసీలోకి 998 క్యూసెక్కుల నీటిని వదులుతున్నట్లు అధికారులు తెలిపారు. వరద నీరు అంచనా బట్టి దిగువకు నీటిని వదులుతున్నామని, హుస్సేన్‌సాగర్ పరీవాహక ప్రాంత ప్రజలను అప్రమత్తం చేసినట్లు అధికారులు వెల్లడించారు.

సమర్థవంతంగా ఎదుర్కోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ : వర్షాకాలం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలని హైడ్రా కమిషనర్ రంగనాథ్ అన్నారు. శనివారం జేఎన్‌టీయూహెచ్ క్లాస్‌రూం కాంప్లెక్స్‌లో కూకట్‌పల్లి, శేరిలింగంపల్లి జోన్ ఇంజినీరింగ్ అధికారులతో వర్షాకాలం విపత్తులపై సమావేశాన్ని నిర్వహించారు. దీనికి హైడ్రా కమిషనర్ రంగనాథ్, కూకట్‌పల్లి జడ్సీ అపూర్వ్ చౌహాన్, శేరిలింగంపల్లి జడ్సీ ఉపేందర్‌రెడ్డి, ఎస్ఈలు చిన్నారెడ్డి, శంకర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ... కాలనీలు, బస్తీల్లో తరచూ ముంపు సమస్యలు ఎదురవుతున్న ప్రాంతాలను గుర్తించి.. వాటిపై ప్రత్యేక దృష్టిని సారించాలన్నారు. వర్షాకాలంలో వరదనీటితో వచ్చే సమస్యలను ప్రణాళికాబద్ధంగా పరిష్కరించాలన్నారు. ఆయా సర్కిళ్లకు చెందిన ఇంజినీరింగ్ విభాగం అధికారులు నిరంతరం అప్రమత్తంగా ఉండాలని, క్షేత్రస్థాయిలో ముంపు సమస్యలను పరిశీలించాలన్నారు. ప్రాంతాల వారీగా అత్యవసర బృందాలను అప్రమత్తం చేయాలన్నారు. వాన నీటి కాలువల్లో చెత్తచెదారాన్ని ఎప్పటికప్పుడు తొలగించాలని, నీటి ప్రవాహానికి అడ్డంకులు లేకుండా చూడాలన్నారు. రోడ్లపై ట్రాఫిక్ ఇబ్బందులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు.

ఓయూ టెక్నాలజీలో కొత్తగా బీటెక్ ఆనర్స్

వివరాలు వెల్లడించిన ప్రిన్సిపాల్ ప్రొ. చింత సాయిలు

ఉస్మానియా యూనివర్సిటీ, జూలై 20: ప్రతిష్టాత్మక ఉస్మానియా యూనివర్సిటీ టెక్నాలజీ కళాశాలలో నూతనంగా పలు కోర్సులను ప్రవేశపెట్టారు. మారుతున్న పరిస్థితులు, సాంకేతికతకు అనుగుణంగా పరిశ్రమ అవసరాల రీత్యా నూతన కోర్సులకు శ్రీకారం చుడుతున్న తరుణంలో, కొత్తగా పరిస్థితులకు అనుగుణంగా కోర్సులను ప్రవేశపెట్టాలని అధికారులు నిర్ణయించారు. అధికారుల నిర్ణయంతో ఇప్పటికే వివిధ అరుదైన కోర్సులతో దూసుకుపోతున్న కళాశాల కీర్తి కిరీటంలో మరిన్ని కలికితురాయిలు చేరనున్నాయి. ఈ వివరాలను శనివారం నిర్వహించిన సమావేశంలో కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు వెల్లడించారు. ఆయన మాట్లాడుతూ 2023-24 విద్యా సంవత్సరం నుంచి బీటెక్ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టినట్లు వివరించారు. బీటెక్ ఆనర్స్ కోర్సును ప్రవేశపెట్టినప్పటికీ, అదనంగా ఈ కోర్సులో ఎవరినీ చేర్చుకోబోమని స్పష్టం చేశారు.

ఇప్పటికే కళాశాలలో బీటెక్ అభ్యసిస్తున్న వారిలో తమ పాఠ్య ప్రణాళికకు అదనంగా సబ్జెక్టులను చదివి అదనపు క్రెడిట్లు సాధించిన వారికి బీటెక్ ఆనర్స్ పట్టాను ప్రదానం చేయనున్నట్లు వివరించారు. 2023-24 విద్యాసంవత్సరానికి గాను నలుగురు విద్యార్థులకు ఈ పట్టాలను అందించనున్నట్లు తెలిపారు. కెమికల్ ఇంజినీరింగ్, టెక్స్‌టైల్ టెక్నాలజీ విభాగాల్లో డిప్లమాలు పూర్తి చేసి, ఆయా రంగాల్లో పనిచేస్తున్న వారికోసం ప్రత్యేకంగా బీటెక్ కోర్సులను ఈ ఏడాది (2024-25 విద్యా సంవత్సరం) నుంచి ప్రారంభించనున్నట్లు ప్రకటించారు. ఇప్పటికే కళాశాలలో విద్యార్థుల సౌలభ్యం కోసం ఏఆర్‌డీఐ, ఎంఎస్ఎంఈ – ఎంఐ, ఐపీఈసీ, ఐపీఆర్ కేంద్రాలను ప్రారంభించినట్లు వివరించారు. దాంతో ఈ ఏడాది కళాశాలలో దాదాపు 90 శాతానికి పైగా విద్యార్థులకు ప్లేస్‌మెంట్స్ లభించాయని చెప్పారు.

కళాశాల బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్ ఎన్నిక

టెక్నాలజీ కళాశాల నూతన బోర్డ్ ఆఫ్ గవర్నెన్స్‌ను శనివారం ఎన్నుకున్నారు. కళాశాలలో నిర్వహించిన సమావేశంలో నూతన సభ్యులను ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. బోర్డు చైర్మన్‌గా సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కశ్మీర్ వైస్ చాన్సలర్ ప్రొఫెసర్ ఏ.రవీంద్రనాథ్, సభ్యులుగా భారత రక్షణ శాఖ అడ్వాన్స్‌డ్ సిస్టమ్స్ లేబోరేటరీ అసోసియేట్ డైరెక్టర్ డాక్టర్ అనిల్ కుమార్, రైమ్ ఆర్గానిక్స్ అండ్ కెమికల్స్ లిమిటెడ్ ఎండీ రాజమహేందర్‌రెడ్డి, సభ్యులుగా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ నరసింహ మంగదొడ్డి, కళాశాల ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చింత సాయిలు, ఫ్యాకల్టీ ఆఫ్ ఫార్మసీ డీన్ ప్రొఫెసర్ వీవీ బసవరావు, కళాశాల డిప్యూటీ రిజిస్ట్రార్, ఇంజినీరింగ్ కళాశాల ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ ప్రొఫెసర్ చంద్రశేఖర్ ఎన్నికయ్యారు.